పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే భూ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు పెండింగ్ ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ను కలసి ఎ.పి.ఐ.ఐ.సి, పరిశ్రమల శాఖ, ఆర్.డి.ఓ వెంటనే భూ సంబంధిత అంశాల పై చర్చించుకొని పరిష్కారాన్ని చేయాలన్నారు. ముఖ్యంగా కొత్తవలస మండలం రెల్లి లో 158 ఎకరాల్లో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్, పెదరావు పల్లి గ్రామంలో నున్న 70 ఎకరాల డి. పట్టా భూములు, కంటకాపల్లి భూముల అలియనేషన్ కు సంబంధించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్.డి.ఓ సూర్య కళ కు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం లో శుక్రవారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ పి ఎం ఈ జి పి క్రింద ఆయా సంస్థలకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సింగల్ డెస్క్ పోర్టల్ క్రింద పరిశ్రమల స్థాపనకు అందిన దరఖాస్తులను గడువు లోగా పరిస్కారం చేయా లని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. గత సమావేశం నుండి ఈ సమావేశం వరకు నెల రోజుల్లో 81 దరఖాస్తులు అందగా 48 దరఖాస్తులకు అనుమతులు ఇవ్వడం జరిగిందని, 29 దరఖాస్తులు వేర్వేరు శాఖల వద్ద పెండింగ్ ఉన్నాయని, 4 దరఖాస్తులను తిరస్కరించడం జరిగిందని డి.ఐ.సి జనరల్ మేనేజర్ పాపారావు తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ గడువులోగా ఆయా శాఖల వారు పరిష్క రించాలని, తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను పేర్కొనాలని తెలిపారు. సమావేశం లో సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, ఆర్.డి.ఓ సూర్య కళ, జిఎం డి.ఐ.సి పాపా రావు, ఎ.పి.ఐ.ఐ.సి జిఎం యతిరాజు, కాలుష్య నియంత్రణ మండలి, ఇన్స్పెక్టర్ అఫ్ ఫాక్టరీస్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల రెఫరీగా లక్ష్మణరావు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: గోవాలో నిర్వహించనున్న 37వ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు రెఫరీగా నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామానికి చెందిన పతివాడ లక్ష్మణరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన్ని పలువురు అభినందించారు. ఈనెల 31 నుంచి నవంబరు 3వ తేదీ వరకూ గోవాలో నిర్వహించనున్న రెజ్లింగ్ పోటీలకు మన రాష్ట్రం నుంచి రెఫరీగా లక్ష్మణరావు వ్యవహరించనున్నారు. లక్ష్మణరావు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

చినుకు పడదు .... చింత తీరదు

- ఎండిపోతున్న వరి పైరు
- వర్షానికై రైతన్నల ఎదురుచూపులు

విశాలాంధ్ర-భోగాపురం: వర్షాభావంతో మండలంలో రైతన్నలు విలవిల్లాడుతున్నారు. సరైన వర్షాలు లేక వరి పైరు ఎండిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. తుఫానుల కారణంగా పడిన వర్షం తప్ప కాలానుగుణంగా సరైన వర్షాలు ఈ సంవత్సరం పడలేదని మండల రైతులు నిరాశ చెందుతున్నారు. వరి పైరు పొట్ట దశలో ఉండగా తగిన నీరు లేక పోవడం వరి కంకులు వేయడంలేదని, సరైన ఎదుగుదల లేక దిగుబడి రావటం కష్టంగా ఉందని వాపోతున్నారు. రైతులు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి ఎరువులు, పురుగు మందులు వాడి పంట చేతికి వచ్చే సమయంలో సరైన దిగుబడి రాక, తెచ్చిన అప్పులు తీర్చలేక, అప్పుల పాలై తున్నామని ఆందోళన చెందుతున్నారు. కాలువలు ద్వారా నీళ్లు రావటం లేదని రైతులు అంటున్నారు. మరో వారం రోజుల్లో వర్షాలు కురువక పోతే మరింతగా రైతన్నలు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు ఉన్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మండలాన్ని కరువు మండలంగా ప్రగటించి,పంట బీమా అందించి ఆదుకోవాలని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేసున్నారు.

ఈ క్రాప్ నమోదులో తప్పులు దొర్లితే 29 లోపు సరిచేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి వీటి రామారావు

విశాలాంధ్ర-కొత్తవలస: రైతులు ఈ క్రాప్ నమోదులో తప్పులు దొర్లితే ఈనెల 29 లోపు చెక్ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి. రామారావు రైతులకు సూచించారు. ఈ క్రాఫ్ సోషల్ ఆడిట్ ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా కొత్తవలస మండలం రెల్లి గ్రామంలో కొత్తవలస వ్యవసాయ సభ డివిజన్ ఏడిఏ విజయ తో కలిసి శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ క్రాఫ్ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంటలో నమోదు చేసిన ప్రతి రైతు పేరును గ్రామసభ నిర్వహించి చదివి వినిపించాలని ఈ పంట నమోదు ప్రక్రియలో ఏమైనా చిన్న చిన్న పొరపాట్లు జరిగినట్లయితే రైతులు గమనించి స్థానిక వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులను తెలియజేసినట్లయితే మరలా సరిచేసే అవకాశం ఈనెల 29 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని వ్యవసాయ శాఖ నుండి వచ్చే వివిధ ప్రయోజనాలను రైతులు పొందాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్ విజయ, వ్యవసాయ అధికారి మాధురి శరణ్య, వీఏఏ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ముఖద్వారం ప్రారంభం

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో గూడెం సెంటర్ పాలవలస రోడ్డులో నిర్మించిన పున్నపురెడ్డిపేట దుర్గా గుడి ఆలయం ముఖ ద్వారం శుక్రవారం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి పొట్నూరు ప్రమీల ప్రారంభోత్సవం చేశారు. వేద పండితులు మంత్రో చరణాలు మధ్య నేల తాళాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఆర్చ్ నిర్మాణ కర్త పి. రామారావు, పుష్పలత దంపతులు మాట్లాడుతూ ఈ ఆలయం ముఖ ద్వారం దాతలు సహకారంతో 19 లక్షల రూపాయలుతో అత్యంత సుందరంగా నిర్మించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు బుర్లె శ్రీనివాసరావు, రమణమ్మ, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ వై లక్షణరావు, అప్పలనాయుడు, శ్రీను, రామకృష్ణ,రాము, మండల పార్టీ అధ్యక్షులు స్వామి నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బొద్దాం సోంపురం పాఠశాలను ఎంఈఓ సందర్శన

భోధనాంశాలను, భోజన పథకాల పరిశీలన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాంలో ఎంపీపి పాఠశాలను, సోంపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖధికారి పి బాల భాష్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతులకు చెందిన వర్క్ బుక్స్, తెలుగు, ఆంగ్లం చదవడం రాయడం, చతుర్విధ ప్రక్రియలు, మోడల్ లెసన్ తదితర భోధనాంశాలను అరుణ కళా టీచర్ చే భోదింపజేశారు. అలాగే డ్రాయింగ్ మరియు టిఎల్ ఎం లెసన్ ప్లాన్, ఉపాధ్యాయ డైరీలు మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులను పరిశీలించారు. అలాగే వచ్చే నెల 3వ తేదీన జరగబోయే స్టేట్ ఎడ్యు కేషనల్ అచీవ్మెంట్ సర్వేను పురస్కరించుకొని మండలంలోని సోంపురం హైస్కూలును సందర్శించి మూడు, ఆరు, తొమ్మిదవ తరగతులకు విద్యా శాఖ ఇచ్చే సీస్ ప్రాక్టీస్ టెస్ట్ పేపర్లను విద్యార్థులకు సానుకూల వాతావరణంలో మౌఖికంగా వివరించారు. అనంతరం ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి ఎంఈఓ బాల భాష్కరరావు పలు సూచనలు చేసారు. ఈ సందర్శనలో ఆయన వెంట హెచ్ ఎం బీపిఏ రాజు, సిఆర్పీ రాంప్రసాద్ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నబెల్ట్‌షాపులు

చిల్లరి దుకాణాల మాదిరిగా మద్యం విక్రయాలు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో పుట్టగొడుగుల్లా మద్యం బెల్ట్ షాపులు పుట్టుకొచ్చి మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలు గ్రామాల్లో బెల్ట్‌షాపు లు రాత్రి, పగలు అనకుండా చిల్లరి దుకాణాల మాదిరిగా విక్రయాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా గ్రామాల్లో మద్యం విక్రయాలు చేస్తుండటం మాలాంటి పేదల బతుకుల్లో నీళ్ళు జల్లడమేనని, బెల్ట్ షాపులు ఊరి మధ్యలో ఉండకూడదని, ఎక్కడో ఒకచోట లైసెన్స్ షాప్ లు మాత్రమే ఉంటాయేగాని, ఆ లైసెన్స్ షాప్ ల లో కూడా ఒక వ్యక్తి కి 2-3 బాటిళ్లు తప్ప ఎక్కువ ఉంటే కేసులు కడతామని నిబంధనలు ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోకుండా నేరుగా గ్రామాల్లోనే కిరాణా షాపుల్లోకి సంచులతో తెచ్చుకుని మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్నారని దీనివల్ల ఇంట్లో మగవారు మద్యానికి బానిసై తరచూ కుటుంబాల్లో గొడవలు ఏర్పడుతున్నాయని, ఎన్నో జీవితాలు చిన్నా బిన్నం అయిపోతున్నాయని , ఈ మద్యం మహమ్మారి వలన బతుకులు రోడ్డుపాలవు తున్నాయని గ్రామాల్లో మహిళలు విలపిస్తున్నారు. మద్యం అమ్మకాలు కొనసాగుతుంటే ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికయినా జిల్లా స్థాయి అధికారులు ఈ మద్యం అమ్మకాలపై దృష్టిసారించి పల్లెల్లో మద్యం అమ్మకాలు లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. గ్రామాల్లో విచ్చలవిడి బెల్ట్‌షాప్‌ల విక్రయాలపై ఎక్సేంజ్ సిఐ జయభీం ను వివరాలు కోరగా ఏ గ్రామంలో అయిన బెల్ట్‌షాపు లు విక్రయించకూడదని అలా విక్రయించినట్లయితే కేసు నమోదు చేసి కోర్టులోకి హాజరు పరుస్తామని, బెల్ట్ షాపు విక్రయాలు చట్టపరమైన నేరం అని సిఐ అన్నారు....

దేశానికే ఆదర్శం జగనన్న ఆరోగ్య సురక్ష : ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర-శృంగవరపు కోట : రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. శుక్రవారం మండ లంలోని ముషిడి పల్లి గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన వైస్ఎంపిపి సుధారాజుతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ దేశంలోనే మొట్ట మొదటి సారిగా రాష్ట్ర ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేసి అవసరమైన వారందరికీ వైద్యం అందించడం ఒక అద్భుత కార్యక్రమమన్నారు. రాష్ట్రంలో సుమారు కోటీ 63లక్షల కుటుంబాల్లో దాదాపు 5కోట్లు మందికి చెందిన ఆరోగ్య డేటాను సేకరించడం జరుగుతోందన్నారు. ఈశిబిరాల ద్వారా ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటువంటి గొప్ప కార్యక్రమం దేశంలోని మరే రాష్ట్రంలోనూయ నిర్వహించలేదన్నారు. ఈకార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్య శజబిరాలను పరిశీలించిన అనంతరం ఐసిడిఎస్ ఏర్పాటు చేసాన స్టాల్స్‌ను ఆయన పరిశీలన చేసారు. ఈకార్య క్రమంలో ఎంపిపి ఎస్.సోమేశ్వరరావు, జెడ్పిటిసి ఎం. వెంకటలక్ష్మి, ముషిడి పల్లి సర్పంచ్ సొలుబొంగు దారప్ప, ఎన్‌కోట సర్పంచ్ సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను భక్తులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి

హోటళ్ల యజమానులకు ప్రజారోగ్య అధికారి డా.సాంబమూర్తి సూచన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పైడితల్లమ్మ సిరిమానోత్సవానికి విచ్చేసే భక్తులకు పరిశుభ్రమైన ఆహారం అందించే విధంగా హోటళ్ళు, తినుబండారాల దుకాణ యజమానులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో పలు హోటల్లు, చికెన్ సెంటర్లు, తినిబండారాల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఓ హొటల్లో అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించి సదరు యజమానిని హెచ్చరించారు. రుచికరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో తినుబండారాలను తయారు చేయాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈగలు, దోమలు లేకుండా ఎప్పటికప్పుడు హొటల్లు తినిబండారాల దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పటికప్పుడు తయారు చేసిన పదార్థాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. నిల్వ ఉన్న పదార్థాలను విక్రయించినట్లు గమనిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని ఓ ప్రధాన హొటల్లో ఫ్రిజ్లో నిల్వ ఉన్న పదార్థాలను గమనించారు. తినిబండారాలను నిల్వ ఉంచి మరల వాటిని వేడి చేసి విక్రయించడం పట్ల మండిపడ్డారు. ఇదే పరిస్థితి పునరావృతం అయితే క్షమించేది లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ పైడితల్లమ్మ సిరిమానోత్స వానికి అశేష భక్తజనం వివిధ ప్రాంతాల నుండి నగరానికి తరలివస్తారని అన్నారు. ఈ పరిస్థితుల్లో వారికి అవస రమైన ఆహారాన్ని పరిశుభ్రంగానూ, స్వచ్ఛత గాను ఉండాలని అన్నారు. ఎక్కడైనా తినిబండారాల స్వచ్ఛతలో లోపం ఏర్పడినట్లు తమకు సమాచారం వచ్చినట్లయితే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిల్వ ఉన్న పదార్థాలు, అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేపట్టారాదని స్పష్టం చేశామన్నారు. అలాగే హొటల్లు తినిబండారాల దుకాణాలలో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిషేధిస్తున్నామని చెప్పారు. అలాగే ప్రసాద వితరణలు, మంచినీటి పంపిణీ కేంద్రాల వద్ద ప్లాస్టిక్ గ్లాసులు గాని ముచ్చు సంచులు గాని వాడరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో సంబంధిత వార్డు సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం పట్టణం మున్సిపల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో గొల్ల వీధిలో విస్తృత స్థాయి పర్యటన చేశారు. యాదవ వీధి నందు ఇంటింటి చెత్త సేకరణ మరియు కాలువల శుభ్రపరుచుటను పరిశీలించారు షెడ్యూల్ ప్రకారం డ్రైన్లు క్లీనింగ్ జరగాలని మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. వీధి దీపాములు వెలుగుతున్నది లేనిది మరియు కుళాయిలు వస్తున్నది లేనిది అక్కడ ఉన్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న స్మశాన వాటికను పరిశీలించి అక్కడ చెత్తలు వేయకుండా చూడాలని మరియు సామూహిక మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ నా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ గోలగాని రమాదేవి పాల్గొన్నారు.

గుడివాడలో వంట పాత్రలు, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ



విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని గుడివాడ గ్రామంలో పాఠశాలలోని మధ్యాహ్నం భోజన నిర్వాహకులకు వంట పాత్రలను, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను శుక్రవారం ఆ గ్రామ సర్పంచ్ ఎంద్రాపు రామునాయుడు పంపిణీ చేశారు. విద్యార్థులకు చదువులలో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు

O.S. 3/2017

బిట్వీన్ :
గోపిశెట్టి రోజారాణి వగైరాలు... వాదులు
ఎండ్:
దేవిరెడ్డి రామారావు(డైడ్) వగైరాలు
... ప్రతివాదులు

టు,
7. అద్దంకి రాధారాణి భర్త లేటు సంపత్‌కుమార్, వయస్సు 50 సం॥లు, విజయవాడ
8. నలితం జ్యోతి భర్త శ్రీనివాసరావు, వయస్సు 48 సం॥లు, విజయనగరం
9. అల్లం అమర భర్త రాజశేఖర్, వయస్సు 42 సం॥లు, గాజువాక, విశాఖపట్నం.
10. రంకిరెడ్డి భారతి భర్త నాటనౌన్ తండ్రి లేటు రామారావు వయస్సు 40 సం॥లు, వెంకంపేట గ్రామం, మక్కువ మండలం పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు దావాలో పార్టీలుగా చేరే నిమిత్తం పిటిషను దాఖలు చేసియున్నారు, సదరు ప్రతివాదులు డి7 టూ డి10 పార్టీలుగా యాడ్ అయివున్నారు. సదరు దావా వాయిదా తే. **08-11-2023** ది కి వాయిదా అయి యున్నది. సదరు వాయిదా దినముమీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో ఉదయం **10-30** గం॥లకు శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ యొక్క వాదన దాఖలు చేసుకోగలరు. లేని యడల మీ పరోక్షమున సదరు పిటిషనులో తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.
బొబ్బిలి,
తేది: 24-10-2023

కె. ప్రసాదరావు
వాది తరుపు అడ్వకేట్, బొబ్బిలి

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

జగనన్నకు చెబుదాంలో కలెక్టర్‌కి సిపిఐ వినతి

విశాలాంధ్ర-కురుపాం: కురుపాం నియోజకవర్గంలో గిరిజన ప్రజానీకం ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తుంది, గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎంపీడీవో ఆఫీస్ లో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విచ్చేసిన కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను సిపిఐ బృందం కలిసి కురుపాం నియోజకవర్గంలో ప్రజానీకం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి టీ జీవన్న మీడియాతో మాట్లాడుతూ ఇందులో ప్రధానంగా గుమ్మలక్ష్మి పురం మండలంలోని పది పంచాయితీలో 42 గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్న, ఇల్లు లేని గిరిజనులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించి,మంజూరు చేసి ఆదుకోవాలని, కురుపాం మండలంలోని ఐదు పంచాయతీ పరిధిలో గల 32 గ్రామాల ఇల్లు లేని గిరిజనులకు (తులసి, లంక జోడి కొండ బారిడి ఉదయపురం తదితర గ్రామాలు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కురుపాం మండలంలో తిత్తిరి పంచాయతీ పరిధిలో గల గ్రామాల్లో,, కొమరాడ మండలంలో పలు గ్రామాల్లో ఏనుగుల సంచారంతో బీభత్సం చేస్తూ పంటలను నాశనం చేస్తూ, ఇళ్లను ధ్వాంసం చేస్తూ, గిరిజన ప్రజానీకానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగులను అడవికి గాని జూ గాని తరలించాలని, నష్టపోయిన గిరిజన ప్రజానీకానికి నష్టపరిహారం చెప్పించాలని కురుపాం నియోజకవర్గంలోని గిరి శిఖర గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకుండా గిరిజన ప్రజానీకం బ్రతుకుతుంది, ఉదాహరణకు లు%శీ%బేసు లో రక్షిత మంచినీటి సౌకర్యం ఇప్పటికీ లేదు, తులసి రక్షిత మంచినీటి సౌకర్యం ఇప్పటికే లేదు, గ్రామాలకు రోడ్లు లేక రాకపోకలకు చాలా ఇబ్బందులకు పడుతున్నారు, మౌలిక సదుపాయాలు కల్పించి కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాదు గిరిజన సంఘ నాయకులు రామ్మూర్తి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు



విశాలాంధ్ర-పార్వతీపురం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా పోలీసు ఉద్యోగులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డి.సి.ఆర్.బి. సిఐ ప్రభాకరరావు, ఎస్ఐ పాపారావుల పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఈనెల 31 వరకు నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగా పోలీసుశాఖ పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ ఉద్యోగులకు "లైంగిక వేధింపుల నుండి మహిళలు మరియు పిల్లల రక్షణ - సామాజిక పాత్ర" అంశంపై వ్యాసరచన, మరియు "సోషల్ మీడియా దుర్వినియోగం-సైబర్ మోసాన్ని ఎదుర్కోవడంలో సాంకేతికత ప్రభావం"పై వక్తృత్వపు పోటీలు నిర్వహించామన్నారు. ఈపోటీలలో పాల్గొన్న పోలీస్ ఉద్యోగులకు, ఉత్తమప్రతిభ కనబరిచిన వారిని ఎంపికచేసి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు .ఈకార్యక్రమంలో ఎస్బి సిఐ సిఎచ్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సిటీ ఎగ్జిబిషన్‌లో నిబంధనల ఉల్లంఘన

పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆరోపణ

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్ లో ఏర్పాటుచేసిన సూర్యఆదిత్య ట్రేడ్ ఫేర్ వారి ఫారన్ సిటీ ఎగ్జిబిషన్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంగించారని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎంట్రీ ఫీజు రూ.50 లు పెట్టడం అన్యాయమని, తాగునీటి సౌకర్యం కల్పించలేదని, మహిళలకు, పిల్లలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదని, ప్రమాదం జరిగితే అత్యవసర మెడికల్ కిట్లు గానీ, అగ్ని, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాల జరగకుండా ముందస్తుగా ఇసుక, నీళ్ళు ఆక్సిజన్ సిలండర్స్ వంటివి ఏర్పాటుచేయలేదని, ధరల నియంత్రణ పట్టిక ఏర్పాటు చేయ లేదని ఆరోగ్యానికి హాని కలిగించే నాసిరకమైన దినసులతో తినుపదార్థాలు విక్రయిస్తున్నారని ఇన్ని లోపాలు ప్రభుత్వ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. వినోదం కోసం వెళ్ళే వారికి ప్రమాదకరమైన యంత్రాల వల్ల ఏదైన జరిగితే ఎవరు భాధ్యత వహిస్తారన్నారు.

పర్యాటక పనులను వేగవంతం చేయాలి

ఐటిడిఎ పీవో కల్పనకుమారి



విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న పర్యాటక ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పీవో కల్పనకుమారి అన్నారు. శుక్రవారం ఆదలి వ్యూ పాయింట్, గిరిజన మ్యూజియం, జగతిపల్లి రిసార్ట్స్ పనులను పరిశీలించారు. ఆదలి వ్యూ పాయింట్, గిరిజన మ్యూజియం పనులను నవంబర్ 15 నాటికి పూర్తి చేయాలని అన్నారు. జగతిపల్లి రిసార్ట్స్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో నాణ్యత లోపించకూడదని అన్నారు. ప్రతీరోజు పని జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ సింహాచలం, ఏఈలు మోహన్ గోపాల్, నాగభూషన్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్



విశాలాంధ్ర-బెలగాం : కొమరం భీమ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి. రంజిత్ కుమార్ అన్నారు. ఈమేరకు పార్వతీపురం మండలం మరికి పంచాయతీ కొత్తఊరు గ్రామంలో కొమరం భీమ్ వర్ధంతి పురస్కరించుకుని సభ నిర్వహించారు. ఈసందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ అడవి నుండి గిరిజనులను తరిమేయాలని ప్రభుత్వాలు, పాలకులు కుట్రలు చేస్తున్నారని దీనిపై పోరాటం చేయటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, గ్రామ పెద్దలు హిమరక సంగయ్య, హిమరక సోదారాం, భాస్కరరావు లక్ష్మణరావు, కొమరం భీం యూత్ అధ్యక్షులు బొండపల్లి జనార్ధన, మహిళలు నిమ్మక సుశీల, మండంగి మరియ, కేంద్రుక కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్.వెంకమ్మపేట సచివాలయంలో జగనన్నఆరోగ్యసురక్ష

550 మందికి తనిఖీలు నిర్వహించి మందులు అందజేత

విశాలాంధ్ర-సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలఆరోగ్యంకోసం, రోగులబాధలు నివారణకోసం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వరమని ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ బాబ్జిలు తెలిపారు.శుక్రవారంనాడు మండలంలోని ఆర్ వెంకమ్మపేట గ్రామసచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ప్రాదమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శన చేశారు. శిబిరంవద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా అందజేస్తున్న వైద్యసేవలను పరిశీలించారు.ఆర్ వెంకమ్మపేట, రామవరం గ్రామాలకు చెందిన 550మందికి పైగా రోగులకు వైద్యసేవలు అందించామని వైద్యులు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య వైద్యశిబిరంలో సీతానగరం, పెదంకలం పిహెచ్‌సి వైద్యులు,శిరీష,ఉషారాణి రాధాకాంత్ ,ప్రభుతేజా, స్పెషలిస్టు వైద్యులు అనూష,కిరణ్,జగదీష్‌లు తనిఖీలు నిర్వహించి మందులను అందజేశారు.కొంతమందిని రిఫర్ కూడా చేశారు. 104 సిబ్బంది ప్రసాద్, ఈశ్వరరావులు కూడా పాల్గొని సేవలు అందించారు. అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేయగా ఐసీడీఎస్ పిఓ సుగుణ, సూపర్ వైజర్ పూర్ణిమలు పాల్గొని దీనివల్ల కలిగే ఉపయోగాలు వివరించారు.పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా వాడాలని కోరారు.ఈకార్యక్రమంలో మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, తహశీల్దార్ ఎన్వీ రమణ, ఈఓపి ఆర్డీవర్మ, ఎంఈఓ వెంకటరమణ, సిహెచ్ఓ ఎన్వీరమణ, హెచ్‌వి భవానీ, హెచ్ ఎస్ శర్మ, పాఠశాల హెచ్ఎం చప్ప మాధవరావు, సర్పంచ్ పెంట శ్రీదేవి, శ్రీనివాసరావు, ఏగిరెడ్డి త్రినాథ, రెడ్డి సూర్యనారాయణ, పెంటసత్యం, పెంట సత్యనారాయణ, పెంట సూర్యనారాయణ, పెంట కృష్ణమూర్తి సచివాలయం సిబ్బంది డిడిఓ పిల్లిమురళీ కృష్ణ,కార్యదర్శిలు రజనీ, జెరుషా, విఆర్ఓ దుర్గా ప్రసాద్, పల్లవి, విద్యాసాగర్, విజయశ్రీ ,గౌతమి, ఆశాజ్యోతి, గాయత్రి, లక్ష్మణ, స్వర్ణ, ప్రభావతి వివిధ సచివాలయాలసిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు,గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శిబిరంవద్ద ఏర్పాటు చేసిన నమోదు స్టాల్, మందులస్టాళ్లు, హెల్ప్ డెస్క్, అంగన్వాడీ స్టాళ్లుతో పాటు ఆరోగ్య విద్యపై అవగాహణ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని అత్యధిక స్థాయిలో ఈసచివాలయంలో రిజిస్ట్రేషన్ జరిగి తనిఖీలు చేపట్టడం జరిగిందని తహశీల్దార్ ఎన్వీ రమణ చెప్పారు. ఇదిలా ఉండగా శనివారంనాడు పెదభోగిలి-1లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు శిరీష ఉషారాణిలు చెప్పారు.

విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ పాఠాలు

విశాలాంధ్ర-పాచిపెంట: పి కొనవలస ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ప్రకృతి వ్యవసాయ మోడల్స్ తయారీలో భాగంగా సైన్స్ అసిస్టెంట్ జానకితో సహా పి కొనవలస క్లస్టర్ పరిధిలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అజోల్ల తయారీ మరియు ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు కలుపు మందులు ఎక్కువగా వాడటంతో భూమిలో జీవ వైవిధ్యం దెబ్బతిని భూమి నిస్సారంగా మారుతుందని, వరి పంటలో అజోల్లతో ఆచ్ఛాధన తో కలుపును నివారించుకోవచ్చుని, అజోల్లా ను పశువుల మేతగా వాడితే పాలల్లో వెన్న శాతం పెరుగుతుందని తెలిపారు సిఆర్‌పి లు సురేష్, విజయల ఆధ్వర్యంలో ఆకుచుట్టు పురుగు మరియు కాండం తొలుచు పురు గుల నివారణకు ఉపయోగపడే పంచ పత్ర కషాయం తయారీని వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కు విశేష స్పందన

విశాలాంధ్ర-కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరానికి విశేష స్పందన లభించింది. ఈశిభిరాన్ని ఎంపీపీ శెట్టి పద్మావతి ప్రారంభించారు. శుక్రవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన వారు వైద్య శిభిరానికి చేరుకున్నారు. డాక్టర్ శంకర్రావు, డా:శ్రీధర్ డా:కావ్య (గైనకాలజిస్ట్) డా:అనీల్(జనరల్ ఫిజీషియన్) 545మంది కి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదికారి డాక్టర్ జగన్నాథరావు శిభిరాన్ని ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుజాత, సర్పంచ్ సుజాత, ఎంపీటీసీలు స్వామియాజులు, బంగారు నాయుడు, సంతోషి ,జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్ ,నాయకులు నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

శంబర గ్రామంలో ధర్మ ప్రచార వారోత్సవాలు



విశాలాంధ్ర-మక్కువ : మన్యంజిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో సంబర గ్రామపంచాయతీలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఆరాధ్య దేవత శ్రీ సంబరపోలమాంబ అమ్మవారి దేవస్థానం శంబర గ్రామంలో ధర్మ ప్రచార వారోత్సవములు సందర్భంగా 6వ రోజు శుక్రవారం శ్రీ కృష్ణ కోలాట బృందం, మరియు శ్రీ శంబర పోలమాంబ కోలాట బృందం శంబర వారిచే కోలాటంలు జరిగాయి. చైర్మన్ పూడి దాల్లినాయుడు దేవ స్థానం నిర్వహణ అధికారి వాక చర్ల రాధాకృష్ణ తెలియపరిచారు.

చినభోగిలి వద్ద రైల్వే ట్రాక్ పనులు నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని చినబోగిలి రైల్వేగేటుకు దగ్గరలో ఎన్నోఏళ్ల క్రితంరాళ్లతో నిర్మించిన స్లాబ్ కల్వర్టును తొలగించి దానిపై వేసిన రెండు రైల్వే ట్రాక్ లైన్లను పూర్తిగా తీసివేసి యుద్ద ప్రాతిపదికన శుక్రవారం పనులు వేగవంతంగా పూర్తిచేశారు. పెద్దఎత్తున జెసిబీలు, యంత్రసామగ్రితోపాటు సిబ్బంది దగ్గరుండి కొత్తగా సిమెంట్ స్లాబ్ దిమ్మలను పెద్ద ప్రొక్లయిన్లు సహాయంతో యుద్ద ప్రాతిపదికన అమర్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైళ్లు నిలుపుదల చేసి పనులు పూర్తి చేసినట్లు రైల్వే సిబ్బంది తెలిపారు. రైల్వే పనులు వేగవంతంగా జరుగుతున్న తీరును స్థానికులు పెద్దఎత్తున విచ్చేసి ఇంత తొందరగా మనుష్యుల సహాయం లేకుండానే ఆధునాతన యంత్ర సామగ్రితో పనులు వేగవంతంగా చేయడాన్ని చూసి ఆశ్చర్యపోయారు.

సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కొత్తవలస:కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గ్రామ సచివాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు , ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు శుక్రవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సుపరిపాలన అందించేందుకు సచివాలయ ఏర్పాటు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి దేనని అన్నారు. అన్ని రకాలైన సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని అన్నారు. ప్రతి కుటుంబానికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్న దాత సీఎం అని ఎమ్మెల్సీ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, సర్పంచ్ కొండలరావు పాల్గొన్నారు.

దెబ్బగుడివలసలో టిడిపి ఇంచార్జి వరిపంట పరిశీలన

విశాలాంధ్ర-పార్వతీపురం: రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైకాపా ప్రభుత్వం రైతులనే నట్టేటముంచే విధంగా వ్యవహరించడం బాధాకరమని, బాధల్లో ఉన్న రైతులను ఆదుకోలేని ఈప్రభుత్వం గద్దె దిగాలని తెలుగుదేశం పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇంచార్జి బోనెల విజయ్ చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దిబ్బగుడి వలసలో నీరులేక ఎండిపోయిన వరి పంటను టిడిపి బృందం పరిశీలించింది. రైతులు టిడిపి బృందానికి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వర్షాలు కురవక నీటి ఆధారంలేక మాపొలాలు ఎండిపోయాయని, అధికార పార్టీ మమ్మల్ని పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం, పోల సత్యనారాయణ,సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపల్లిలో మాజీ ఎమ్మెల్యే ఓటరు జాబితా పరిశీలన



విశాలాంధ్ర-పార్వతీపురం: మండలంలోని కృష్ణకల్లి గ్రామంలో ఓటరు జాబితాను మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, టీడీపీ నాయకులు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు కలసి శుక్రవారం పరిశీలన చేశారు. పార్టీ ఆదేశాలు మేరకు ఓటర్ల జాబితా పరిశీలన జరిపి తొలగించిన ఓట్ల గూర్చి, చేర్పుల గూర్చి బిఎల్ఓలతో చర్చించడం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు లయన్స్ క్లబ్‌లో టీడిపి సమావేశం

విశాలాంధ్ర-సీతానగరం: పార్వతీపురం లైన్స్ క్లబ్లో బాబు షూరిటీభవిష్యత్తు గ్యారెంటీ, వాటర్ వెరిఫికేషన్ పైన శిక్షణ కార్యక్రమంను శనివారం నిర్వహించడం జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి బోనేల విజయ్ చంద్ర తెలిపారు. నియోజక వర్గంలోని మూడు మండలాల క్లస్టర్లు, యూనిట్ , బూత్ ఇన్చార్జులు మరియు సీనియర్ నాయకులు, మండల ప్రెసిడెంట్లు, కౌన్సిలర్సు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పశువైద్య శిబిరాలతో రైతులకు మేలు

విశాలాంధ్ర-గరివిడి: మండలం వెదుళ్ళ వలస గ్రామంలో "జాతీయ సేవా పథకంలో" భాగంగా ఉచిత పశువైద్య శిభిరం మరియు పశువైద్య శిబిరాలతో రైతులకు మేలు అనే కార్యక్రమాన్ని (27.10.2023 శుక్రవారం) గరివిడి పశుసంవర్ధక పాలటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. బసవ రెడ్డి గారు, పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. ప్రభాకర్ రావు గారు మరియు స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ రావు గారు, పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సురేష్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ ప్రెసిడెంట్ గారు, వైస్ ప్రెసిడెంట్ పాల్గొని, రైతులు ఈ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకోవాలని సరైన సమయంలో జీవాలకు చికిత్స అందించాలని ప్రజలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది, తద్వారా రైతులు తమ యొక్క ఆనందాన్ని తెలియజేశారు.

ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సహాయ కమిషనర్ ఆరా

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలోని వీటి అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ, చిక్కాలవీధిలోని ఆర్కే పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఆయా డివిజన్లకు సంబంధించిన కార్పొరేటర్లు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాద్ రావు ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముందుగా వాలంటీర్లతో సర్వే జరిపించి అవసరమైన వారిని ఆరోగ్య శిబిరాల వద్దకు చేరుకునే విధంగా కార్యాచరణ రూపొందించారు. ఆ ప్రకారం వచ్చిన ప్రజలకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని కూడా తనిఖీ చేశారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా వీటి అగ్రహారంలోను చిక్కాల వీధులను ఆయా డివిజన్లకు చెందిన ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు చందక శ్రీనివాసరావు, రేగాన రూపా దేవి,బొంగభానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ట్ నమోదు రైతుకు మేలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఈ క్రాఫ్ట్ నమోదు వలన రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి కె రవీంద్ర తెలిపారు. మండలంలోని సంత గౌరమ్మపేట రైతు భరోసా కేంద్రంలో ఈ క్రాప్ ముసాయిదా జాబితాను, సామాజిక తనిఖీ నిమిత్తము గ్రామసభను ఆయన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్. రవిచంద్ర కుమార్ రైతుల యొక్క పేర్లు పంట నమోదు వివరాలను చదివి వినిపించి ఆ జాబితా రైతు భరోసా కేంద్రం నందు రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ క్రాఫ్ట్ సామాజిక తనిఖీల్లో భాగంగా గ్రీవెన్స్ మాడ్యూల్ ను అందుబాటులో ఉంచడం వలన ఏమైనా మార్పులు ఉంటే రెండు రోజులు అవకాశం ఉందని గ్రామసభకు హాజరైన పెద్దలకు రైతులకు తెలియజేశారు.

17 మద్యం బాటిళ్ల పట్టివేత

విశాలంధ్ర-శృంగవరపుకోట: మండలంలోని కొత్తూరు గ్రామంలో 17 మద్యం బాటిల్స్ పట్టుబడినట్లు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ ధర్మారావు తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో మద్యం బెల్ట్ షాపులు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించగా మండలంలోని ఎస్.కోట - తలారి గ్రామానికి చెందిన ఇమ్మిడి శెట్టి సాయిరాం అనే వ్యక్తి నుండి 17 మద్యం సీసాలు లభించాలని వాటిని చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమ్యశ్రీ మరియు ఎస్.ఈ.బి. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబరు లోగా కంటి శస్త్రచికిత్సలు పూర్తి

ప్రభుత్వమే రవాణా సదుపాయాన్ని కల్పిస్తుంది

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: డిసెంబరులోగా కంటి శస్త్రచికిత్సలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా చేయాల్సిన శస్త్రచికిత్సలపై, కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు సుమారు 3,678 మందికి కేటరాక్ట్, గ్లకోమా, టెరీజియం తదితర కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించడం జరిగిందని, మరో 100 సురక్ష శిబిరాలను నిర్వహించాల్సి ఉన్నందున, వీరి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటివరకు సుమారు 300 శస్త్రచికిత్సలు పూర్తి అయ్యాయని చెప్పారు. డిసెంబరులోగా మిగిలిన శస్త్రచికిత్సలను పూర్తి చేయాలని, దానికి తగిన ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. శస్త్రచికిత్సలకు హాజరయ్యే వారికి ప్రభుత్వమే రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుందని చెప్పారు. ఆసుపత్రులకు తరలించి, శస్త్రచికిత్సలు పూర్తి అయ్యేవరకు రోగులను వైద్యాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆసుపత్రులవారీగా చేయాల్సిన శస్త్రచికిత్సలను ఖరారు చేశారు. అవసరమైతే ఏరియా ఆసుపత్రులనుంచి కంటి డాక్టర్లను రప్పించి, వారిచేత ఆపరేషన్లు చేయించాలని సూచించారు. కంటి వెలుగులో భాగంగా, త్వరలో జిల్లాకు భారీ సంఖ్యలో కళ్లద్దాలు రాబోతున్నాయని, ఇప్పటికే గుర్తించిన వారికి వాటిని సచివాలయ సిబ్బంది, ఎంఎన్‌హెచ్ఓ, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్ల ద్వారా జాగ్రత్తగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు, డిసిహెచ్ఎస్ గౌరీశంకర్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు, జిల్లా అంధత్వ నివారణా సంస్థ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.శివప్రసాద్, జిజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రత్నకుమారి, కంటివెలుగు సెల్ ఏఓ తారకేశ్వరరావు, మిమ్స్, శంకర్ ఫౌండేషన్, పుష్పగిరి, అనిల్ నీరుకొండ, ఎన్ఎంఎస్ తదితర ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సుయాత్రలో ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర-వేపాడ: వైస్సార్ కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రలో శృంగవరపుకోట శాసనసభ్యులు కడుబండి శ్రీనివాసరావు భాగస్వామ్యం వహించారు. శుక్రవారం గజపతినగరం నియోజక వర్గంలో జరగనున్న బస్సు యాత్రలో జిల్లా మంత్రులు, సహచర శాసనసభ్యులతో మమేకమయ్యారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఆర్థిక,సామాజిక, రాజకీయ రంగాల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రగతిని ఒక హక్కుగా అందించామంటూ ఈ బస్సు యాత్ర ద్వారా ప్రజలకు వివరించడం జరుగుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు.

గరివిడి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ దీపికా పాటిల్

విశాలాంధ్ర-గరివిడి : వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ ఎం.దీపికా పాటిల్ శుక్రవారం గరివిడి పోలీసు స్టేషన్ ను సందర్శించారు. స్టేషను ప్రాంగణం, ప్రాపర్టీ గది, స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ తనిఖీ చేశారు. అనంతరం, మహిళా పోలీసులు, సిబ్బందితో మమేకమై, వారి సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్ అధికారులు పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఈ తనిఖీల్లో చీపురుపల్లి డిఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి, చీపురుపల్లి సీఐ హెచ్.ఉపేంద్ర, స్థానిక ఎస్ఐ యల్. దామోదర్, ఇతర పోలీస్అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

8600 మందికి పైగా ఆరోగ్య సురక్షలో వైద్యసేవలు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉద్దేశించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ శుక్రవారం వెలగవలస సచివాలయంలో జరుగుతున్న కార్యక్రమంతో మన మండలంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముగుస్తుందని, ముఖ్యమంత్రి వర్యులు పేదల కొరకు ప్రతీ 2000 ప్రజల కొరకు ఒక గ్రామ సచివాలయం నెలకొల్పి ప్రజలందరి కొరకు వారి సొంతవూరిలోనే అన్ని రకాల సేవలను అందించడం జరుగుతున్నాయని, గతంలో ప్రభుత్వ సూచనల మేరకు జగనన్న సురక్ష నిర్వహించి ప్రతీ ఒక్కరికీ అవసరం అయిన సర్టిఫికెట్లు ఉచితంగా అందించడం జరిగిందని, మరియు 30.09.2023 నుండి నేటి వరకు మండలములోని ప్రతీ సచివాలయం పరిధిలో ప్రతీ ఒక్క పౌరుడు ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి, ఆనందముగా జీవితం నింపుకోడానికి ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించబడిందని, దానిలో భాగంగా మొట్టమొదట క్లస్టర్ వాలంటీర్ సర్వే, ఏ.ఎన్.ఎం. మరియు ఎం.ఎల్.హెచ్.పీ. ల ఉమ్మడి సర్వే ఆధారం చేసుకొని, ఎవరికైతే ఆరోగ్యం బాగోకపోతే వారికి ఈ సురక్ష కార్యక్రమంలో 4 డాక్టర్లు, ఒక కంటి వైద్య నిపుణులతో కూడిన బృంద పర్యవేక్షణతో వైద్య శిబిరములు నిర్వహించడం జరిగిందని, ఈ సమయంలో అందించిన వైద్యం సరిపోకపోయి నట్లయితే ఉన్నత వైద్యంకోసం రిఫర్ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంను మండలములో బి.పి., షుగర్ కాకుండా 8600 మందికి పైగా వివిధ ఆరోగ్య సమస్యల కొరకు ఈ వైద్యశిభిరాలను సద్వినియోగం చేసుకోవడం జరి గిందని, వారిలో 200 మందికి పైగా ఉన్నత వైద్యం కొరకు సిఫార్సు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగడానికి సహకరించిన నాయకులకు, వైద్య ఆరోగ్య, ఐ.సి.డి.ఎస్., సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు ధన్యవాదములు తెలపడం జరిగింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యన్నారాయణ, డి. గదబవలస మాజీ సర్పంచ్ ఆదినారాయణ, డి.గదబవలస ఎంపీటీసీ గిరి పాల్గొన్నారు.

వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం/గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలంలో జగనన్న కు చెబుదాం కార్యక్రమానికి 85 వినతులు మండల వారీగా నిర్వహిస్తున్న జగనన్న కు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన వినతలును పూర్తి స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. శుక్రవారం జి. ఎల్ పురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారి ఎమ్. లావణ్య తో కలిసి ప్రజల నుండి అర్జీ లను స్వీకరించారు. జగనన్న కు చెబుదాం కార్యక్రమం లో 85 వినతులు రాగా వాటిలో ఎక్కువగా ప్రజలు తమ గ్రామ సమస్యలు, రోడ్డు, హౌసింగ్ మరియు వ్యక్తిగత సమస్య లు పరిష్కారం గురించి వినతులు అందజేశారు. సమస్య లపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి అదేశాలు, సూచనలు చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడి పంచాయితీ మరియు పెద్దఖర్జ పంచాయితీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, మా రెండు పంచాయతీలలో గల గ్రామాలకు రోడ్డు మంజూరు చేయాలని కద్రక. మల్లేశ్వరరావు, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం మంగళాపురం గ్రామంలో 59 గిరిజన ప్రజలు నివసిస్తున్నామని, ప్రభుత్వం వారు 40 సంవత్సరాల క్రితం రుమ్ముగండ అనే చోట చెక్ డ్యామ్ నిర్మాణం చేసి ఉన్నారని, నేటికీ చెక్ డ్యామ్ పూర్తిగా పాడైపోయినందువలన వ్యవసాయ భూములకు సక్రమంగా నీరు అందక ఇబ్బంది పడుతున్నామని, చెక్ డ్యామ్ మరమ్మత్తులు పూర్తి చేయాలని మండంగి.నాగేశ్వరరావు, రైతులు అర్జీ అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం నంది గూడ గ్రామానికి స్కూల్ మరియు అంగనవాడి భవనం లేక గ్రామంలో ఉన్న చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, మా గ్రామానికి అంగన్వాడి భవనం మరియు స్కూల్ మంజూరు చేయాలని బి. క్రిష్ణ, గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం పంచాయితీ కె.డి కాలనీ గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనం శిధిలావస్థకు చేరుకుందని, అంగన్వాడీ కేంద్రం లో సుమారుగా 40 మంది ప్రీస్కూల్ పిల్లలు, 15 మంది గర్భిణీ స్త్రీలు ఉన్నారని, మా గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్ర భవనాన్ని బాగు చేయాలని ఎ.భారతి, గ్రామస్తులు కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం గ్రామానికి చెందిన పి. జానకి జగనన్న గృహ నిర్మాణం పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్ పేట గ్రామానికి చెందిన మండంగి.మాణిక్యం నాకు 3 సంవత్సరాల నుండి పెన్షన్ మరియు రేషన్ రావడంలేదని వినతి పత్రం సమర్పించారు. గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ గ్రామానికి చెందిన ఎ. చిన్నారావు నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా సబ్సిడీ రుణాన్ని మంజూరు చేయవలసిందిగా కోరారు. కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, స్కూల్ ఎడ్యుకేషన్ సహాయ సంచాలకులు ఎమ్. ఈ.రాణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎమ్.ఎన్. రాణి , జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.మల్లిఖార్జున, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఉద్యానవన అధికారి కె.వి.ఎన్.రెడ్డి, జిల్లా పశు సంవర్ధక అధికారి డా,జే.రత్నాకర్, బి సి సంక్షేమ అధికారి ఎన్.కృష్ణ, ముఖ్య ప్రణాళికా అధికారి వీర్రాజు, ఎల్.డి.ఎమ్ జే ఎల్ ఎన్ మూర్తి, తాసిల్దార్ రాములమ్మ, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సామాజిక విప్లవం

మంత్రులు బొత్స, ముత్యాలునాయుడు, నాగార్జున

విజయనగరంలో సామాజిక సాధికార బస్సు యాత్ర

భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమైందని.. ఇది ప్రజలకు తెలియజెప్పేందుకే బస్సు యాత్ర చేపడుతున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు.. ఏ ఒక్కటి కూడా నెరవేర్చకుండా మోసం చేశారని, ఆయన నయవంచకుడని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ తలపెట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం ఉదయం విజయనగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ శాసనసభ ఉపసభాపతి, స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలునాయుడు, మంత్రి మేరుగు నాగార్జున, మాజీ మంత్రి పుష్పశ్రీవాణి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నాయకులతో కలిసి బొత్స మాట్లాడారు. ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతాల నుంచి సామాజిక సాధికార యాత్రను ప్రారంభించామన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనలో ఏ విధంగా సామాజిక న్యాయం చేశారన్నది ప్రజలు తెలియజేప్పేందుకు బస్సు యాత్రను ప్రారంభించామన్నారు. నాలుగున్నరేళ్లుగా ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. మొదటి రోజు బస్సు యాత్రను ప్రజలు విజయవంతం చేశారని తెలిపారు. చంద్రబాబు మాదిరిగా మోసం చేయడం, వంచించడం ఈ ప్రభుత్వానికి అలవాటు లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ తండ్రి వైఎస్సార్ ఆశయాలను, ఆలోచనలను పుణికిపుచ్చుకున్నారని గుర్తు చేశారు. గతంలో విజయనగరం జిల్లాను టీడీపీ ఎలా మోసం చేసిందో ప్రజలక వివరిస్తున్నా మన్నారు. సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. చంద్రబాబు ఎన్ని లేఖల్కెనా రాసుకోవచ్చని, చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. చంద్రబాబు తప్పు చేయకపోతే కోర్టు ఎందుకు రిమాండుకు పంపిందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆయనకు శిక్ష వేయలేదన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలునాయుడు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు.

ముఖ్యమంత్రి జగన్ ఏలనలో సామాజిక విప్లవం విరాజిల్లుతోందని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. సంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి పుష్పశ్రీవాణి తెలిపారు. రూ.2.83 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి జమ చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా రిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చార న్నారు. గతంలో ఎస్సీలను, ఎస్టీలను చంద్రబాబు అవమానించారని.. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారని గుర్తు చేశారు. నేడు జగన్ నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారని తెలిపారు. సుమారుగా 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికే ఖర్చు చేశారన్నారు. ఈ రోజు కేబినెట్‌లో 18 మంది ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీలు మంత్రులుగా ఉన్నారని.. ఇదీ సామాజిక న్యాయమంటే అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, శాసనసభ్యులు శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు, అలజంగి జోగారావు, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు పరీక్షిత్ రాజు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

విజయనగరంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ

విజయనగరం చేరుకున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు నియోజకవర్గంలో అపూర్వ ఆదరణ లభించింది. బస్సు యాత్రకు మద్దతుగా స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని తన నివాసం వద్ద నుంచి కోలగట్ల జెండా ఊపి ప్రారంభించారు. వందలాది ద్విచక్ర వాహనాలతో బస్సు యాత్రతోపాటు అంబేద్కర్ కూడలి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్అండ్‌బీ, కలెక్టరేట్ మీదుగా గొట్లాం వరకూ ర్యాలీ సాగింది. జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సంగంరెడ్డి బంగారునాయుడు, జి.ఈశ్వర్ కౌశిక్, ఇతర యువజన విభాగం నాయకులు, కార్పొరేటర్లు స్వయంగా బండి నడుపుతూ ర్యాలీలో ముందుకు సాగారు. అనంతరం గొట్లాం నుంచి బస్సు యాత్ర గజపతినగరం బయల్దేరింది.

వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానంలో వంగర విద్యార్థి

విశాలాంధ్ర-వంగర: మండలంలో వంగర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాదీ మహోత్సవకార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు వంగర హై స్కూల్లో నిర్వహించిన వ్యాస రచన,వక్తృత్వ పోటీల్లో వంగర విద్యార్థి పాలవలస యామిని ప్రథమస్తానంలోనిలిచింది. వంగర హెడ్ మాస్టర్ ముద్దాడ రమణమ్మ అద్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో నాలుగు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ వ్యాసరచనపోటీల్లో పాల్గొన్నారు. వంగర, కొప్పర,అరసాడ హైస్కూల్ నుండి,సంగాం ఎంపీయుపి పాటశాలలో విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. వ్యాస రచన పోటీల్లో వంగర విద్యార్థిని పాలవలస యామిని, ద్వితీయ స్థానంలో కొప్పర విద్యార్థి చప్ప దయానంద్, తృతీయ స్థానంలో అరసాడ విద్యార్థి బెవర సిద్దు నిలిచారని హెచ్ ఎం ఎం.రమణమ్మ తెలిపారు.అంతే కాకుండా ఈ పాఠశాలలో జరిగిన వకృత్వా పోటీల్లో వంగర విద్యార్థి ని పాలవలస యమినీనేవరించటం విశేషం. ద్వితీయ స్థానం లోఅర సాడ విద్యార్థి ఎస్.దినేష్ కుమార్,మూడవ స్థానం కొప్పర హై స్కూల్ విద్యార్థి నితూతిక దీక్షిత ను వరించినట్లు వివరించారు.

రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అవసరం : వీరేష్‌చంద్రదేవ్



విశాలాంధ్ర-కురుపాం: ప్రస్తుతం ఉన్న పరిస్థితి లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సేవలు ,ఆలోచన తో కూడిన పాలన తప్పనిసరి అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ యువనేత వైరిచర్ల. వీరేష్ చంద్ర దేవ్ అన్నారు. శుక్రవారం కురుపాం మండలం, నీలకంఠపురం పంచాయతి లోని చింతమానుగూడ గ్రామ ప్రజలు మరియు క్రైస్తవ పాస్టర్లు ఆహ్వానం మేరకు విరేష్ చంద్ర దేవ్ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలు అభివృద్ధి లో జరిగిన వెనుక బాటు వివరించారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజల ఇబ్బందులు గుర్తుచేశారు. గిరిజన ప్రాంతాల్లో వెనుక బాటు పై చైతన్య పరిచారు. ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు.. చింతమానుగూడ మరియు పక్క గ్రామాలు ప్రజలు పాల్గొన్నరు. రాబోయే ఎన్నికల్లో తెలుగు దేశం పార్టి కి ఓటు వేసి చంద్రబాబు ను ముఖ్యమంత్రి ని చేయాలని కోరారు. ...

జామిలో ఇప్పటికి 45,690 మంది ఓటర్లు

ఓటర్ల జాబితాను వెలువరించిన రెవెన్యూ

చేర్పులు, మార్పులకు వచ్చే 12 వరకు మరో అవకాశం

విశాలాంధ్ర-జామి: మండల ఓటర్ల జాబితాను స్థానిక తహాశీల్దార్ జి. హేమంత్‌కుమార్, డిటి సునీతలు శుక్రవారం ప్రచురించారు. ఈమేరకు తెలుగు, ఇంగ్లీష్‌లో కలిగిన జాబితాలను నోటీసు బోర్డులో ఉంచారు. మండలం మొత్తం రెండు నియోజకవర్గాల పరిదిలో ఉండడంతో నియోజకవర్గాల వారీగా ఓటర్లు జాబితాను రూపొందించారు. ఎస్‌కోట నియోజకవర్గానికి సంభందించి 25,725మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 12,580, మహిళలు 13,143మంది ఉన్నారు. గజపతినగరం నియోజకవర్గానికి సంభందించి 9695మంది పురుషులు, 10,269 మంది మహిళలు, ఒక ట్రాన్స్ జెండర్ ఉన్నారు. ఈసందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఫారం-5 నోటసులను విడుదల చేసామని, ఈనెల 27నుంచి వచ్చే నెల 9 వరకు మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని, ఈఅవకాశాన్ని ఓటర్లు వినియోగించుకోవాలని సూచించారు. తిరిగి ఫైనల్ ఓటర్లు జాబితాను జనవరి 5న ప్రచురించడం జరుగుతుందన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

- తోంగ్రంగిలో ఎ. 4.80సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఆక్రమణకి గురైన భూమి విలువ సుమారు రూ. 4 కోట్లు!
- తూతూమంత్రంగా రెవెన్యూ అధికారుల చర్యలు

విశాలాంధ్ర - గరివిడి : ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీ నాయ కులు సైతం ఆక్రమణలు వైపు అడుగులు వేశారు. తమ కన్నుపడిన మరుక్షణమే ఆ భూమిని దశలవారీగా ఆక్రమించి తమ పనికానిచ్చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి మమ అనిపించేశారని స్థానికుల నుండి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే... మండలం తోంగ్రంగి రెవెన్యూ లో సర్వే నంబర్ 236-2 లో సుమారు ఎ. 4.80 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో ఎ. 1.50 సెంట్లు భూమిని 50 ఏళ్ల క్రితం గ్రామానికి చెం దిన ఓ రైతుకి ప్రభుత్వం డి పట్టాని మంజూరు చేసింది. సదరు రైతు కొన్నాళ్ళు పాటు భూమిని సాగు చేస్తూ అనుభవించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా వేరే ప్రాంతానికి వలస వెళ్ళాడు. ఆపై కొన్నేళ్లపాటు ఆ భూమి ఖాళీగా ఉండిపోయింది. ఇటీవల ప్రభుత్వం 20 ఏళ్ళు దాటిన డీ పట్టా భూములను అమ్ముకోవచ్చంటూ జీ.ఓ తో తెచ్చింది. ఆ భూమి పై గుర్ల మండలం నాగళ్ల వలస కి చెందిన ఓ ప్రతిపక్ష నేత కన్ను పడిందట. ఇంకేముంది అనుకున్నదే తడువుగా పథకం ప్రకారం అంచెలంచెలుగా ఆక్రమించుకున్నారట. ముందుగా ఎ. 1.50 సెంట్లు భూమిని ఆక్రమించి ఆపై దానికి ఆనుకుని ఉన్న ఎ.3.30 సెంట్లు పట్టా ఇవ్వని భూమి కూడా ఆక్రమించారట. అంతటితో ఆగకుండా సదరు భూమికి ఆనుకుని ఉన్న సాగునీటి చెరువుని కూడా ఆక్రమించారన్నట్టు సమాచారం.

గుర్ల మండలంలో నాగళ్లవలసకు చెంది, ప్రతిపక్ష పార్టీ లో మండల స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆ వ్యక్తి తన మనుషులతో ఈభూమిని ఆక్రమించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమించిన భూమి విలువ సుమారు రూ. 4 కోట్లు విలువ చేస్తోందని అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వ భూమి అక్రమణ జరుగుతున్న రెవెన్యూ అధికారులు కొన్నాళ్ళు చూసీచూడనట్లు వ్యవహరించారు. అనంతరం స్థానికుల నుండి పెద్ద వచ్చిన ఆరోపణలు మేరకు విచారించారు. ఆక్రమనకు గురవుతున్న ప్రభుత్వ భూమేనని తేల్చారు. అయితే కేవలం సంబంధిత భూమి పైకి వెళ్లి బ్యానర్ తో ఫోటోలు తీసుకుని మమ అనిపించేరట. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో ఆక్రమనదార్లపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చెప్పడతాం : తహశీల్దార్

ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందనే విషయం నా దృష్టికి రాగానే కింది స్థాయి అధికారులను అప్రమత్తం చేసాను. సంబంధిత భూమిపైకి గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్ ని పరిశీలనకై పంపించాను. వారు అందించిన సమాచారం మేరకు సదరు భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారించాం. అనంతరం ఆ భూమిపై ఇది ప్రభుత్వ భూమి ఆక్రమణదార్లు శిక్షార్హులంటూ హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటు చేశాం. ఎవరైనా మరలా ఆక్రమణకు పాల్పడితే సంబంధించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు చెప్పడతాం.

- టి. గోవింద్, తహసీల్దార్, గరివిడి.

రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి

జిల్లా ఎస్పీ ఎం.దీపిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా అక్టోబరు 27న జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో "రక్త దాన శిబిరాన్ని" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎం.దీపిక ముఖ్యఅతిధిగా హాజరై, రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. దీపిక మాట్లాడుతూ - రక్త దానంతో ప్రాణ దానం చేసినట్లేనని, రోడ్డు ప్రమాదాలు, ఇతర అనారోగ్య పరిస్థితుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను, రక్త హీనత కారణంగా ఇబ్బందులకు గురువుతున్న ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, వారికి రక్తాన్ని అందించాలనే లక్ష్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. ప్రాణాలను రక్షించేందుకు మనం చేసిన రక్త దానంతో ఒక వ్యక్తి జీవితం నిలబడుతుందన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా సమాజ శ్రేయస్సు, రక్షణకు, శాంతియుత వాతావరణానికి ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరుల త్యాగాలకు గుర్తుగా నేడు రక్తదాన శిబిరాన్ని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించామని జిల్లా ఎస్పీ ఎం. దీపిక తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం సబ్ డివిజను పరిధిలో పని చేసే పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, కానిస్టేబుళ్ళు, ఆర్మ్డ్ కానిస్టేబుళ్లు, ఎన్సిసి సిబ్బంది పాల్గొని రక్తదానం చేసారు. రక్తదానం చేసిన పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎం.దీపిక, అదనపు ఎస్పీలు అస్మా ఫర్హీన్, ఎస్.వెంకటరావులు పండ్లను, ఫ్రూట్ జ్యూస్ మరియు బిస్కెట్లను అందజేసారు. రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంకులకు సుమారు 50 యూనిట్ల రక్తంను పోలీసుశాఖ అందించింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సెబ్ అదనపు ఎస్పీ ఎస్. వెంకటరావు, ఏఆర్ డిఎస్పీ యూనివర్స్, రోటరీ బ్లడ్ బ్యాంకు అధ్యక్షులు డి.బాలాజీ, క్లబ్ ట్రెజరర్ ప్రవీణ్ కుమార్ అంచాలియా, నారాయణమూర్తి, సిఐలు ఈ.నర్సింహమూర్తి, జె. మురళీ, బి. నాగేశ్వరరావు, ఆర్ఐ ఎన్. గోపాల నాయుడు, డా? తిరుమల ప్రసాద్, రోటరీ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు సుబ్బరాజు, సత్యం, రాధికరాణి, సూర్యలక్ష్మి మరియు ఇతర సభ్యులు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-గజపతినగరం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని గజపతినగరం జడ్పిటిసి గార తౌడు అన్నారు శుక్రవారం మండలంలోని కేంగువ గ్రామం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామలత ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు గర్భిణీలు బాలింతలు పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు తాసిల్దార్ అరుణ్ కుమారి వైసిపి నాయకులు లంక శ్రీనివాసరావు లంక గణేష్ వైద్యాధికారులు అనూజరాయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సవర భాషా పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట: ఐటీడీఏ పరిధిలో గలసీతంపేట, భామినీ వీరఘట్టం, పాలకొండ మండలాలకు చెందిన ఒకటవ తరగతి విద్యార్థుల కొరకు సవర భాషా పుస్తకాలను ఉపవిద్యాశాఖాధి లిల్లీ రాణి పంపిణీ చేశారు. విద్యార్థులు తమ భాషలో నేర్చుకోవడం ద్వారా సులభతరంగా అర్థమవుతుందని తెలిపారు. ఈ సవర భాష పుస్తకాలను భాషా వాలంటీర్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ కోటిబాబు, జిసిడిఓ రాములమ్మ, సీఎంవో చిరంజీవులు పాల్గొన్నారు.

3న రాష్ట్ర స్థాయి విద్యా సామర్థ్యాల మదింపు సర్వే

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శనివారం స్థానిక విద్యావనరుల కేంద్రం తెర్లాం యందు నవంబర్ 3న జరుగబోయే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్మెంట్ సర్వే బి2023...నిమిత్తం అవగాహనా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలో గల సర్వే నిమిత్తం ఎంపిక కాబడిన స్కూల్స్ యొక్క ప్రధాన ఉపాధ్యాయులు, శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్,సర్వే నిర్వహించే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ , సిఆర్పీ లు, ఎమ్ ఆర్ సీ స్టాఫ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నవంబరు 3న జరిగే రాష్ట్ర స్థాయి విద్యా సామర్థ్యాల మదింపు సర్వే మండలం లోని 23 స్కూల్స్ లో, 3.వ,6.వ,9.వ. తరగతుల విధ్యార్ధుల కు నిర్వహించడం జరుగు తుంది.ఈ సర్వే నిర్వహణ సజావుగా నిర్వహణకు అవసరమైన చర్యలు గూర్చి ఎమ్ ఈ ఓ బి2 ఆర్. పాపా రావు , జెడ్పీహెచ్ ఎస్ నెమలాం , హెచ్ ఎమ్ జీ.శ్రీనువాసరావు అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్ గా నియమింపబడిన శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు లకు సర్వే నిర్వహణకు సంబంధించి అవసరమైన తగు నియమ నిబంధనలు , సూచనలు ఇవ్వడమైనది అని ఎమ్ ఈ ఓ జే.తిర్నాధరావు విలేకర్ తో తెలిపారు.

గొర్రెల పెంటలు తొలగించాలి : స్థానికుల గగ్గోలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: స్థానిక గొల్లపాకలు ప్రాంతంలో సర్వే నెంబరు 188 లే అవుట్లోనివాస స్థలాల మధ్య అనధికారికంగా గొర్రెల పెంపకందారులు గొర్రెల పెంటలను టన్నుల కొద్దీ నిల్వ చేయడం కారణంగా వీధి దుర్గంధభరితంగా తయారయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నిల్వల కారణంగా కాలువలు కూడా మూసుకు పోయి మురికి నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి రహదారి పైకి మురికి నీరు ప్రవహిస్తోంది. దోమల, పాముల ఆవాసాలకు అనుకూలంగా మారడముతో ప్రాణభయంతో స్థానిక నివాసితులు ఆగ్రహిస్తున్నారు. స్థానికంగా భవన నిర్మాణం చేపట్టిన బిల్డరు పిల్లా రామకృష్ణ బిల్డింగ్ మెటీరియల్ రవాణా కోసం ఒక చోట కాలువను విరగ్గొట్టడము, మరోచోట పూర్తిగా మూసివేయడము వలన పరిస్థితి మరింత జటిలంగా మారింది. పంచాయితీ వారు పరిశీలించి, కాలువ పూడికలు తీయించి, మరమ్మతులు చేయాలని, మురికి నీరు ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలని, తక్షణమే గొర్రెల పెంటలను తరలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు

మండల మాలమహానాడు అధ్యక్షులు కిరణ్

విశాలాంధ్ర-వేపాడ: కొంతమంది నిరక్షరాస్యులు జన్మతః ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వయసురీత్యా అర్హులైనప్పటికి ఆధార్ కార్డుల్లో వయసు తప్పుగా నమోదు చేయడం వల్ల అర్హత కోల్పోయి నిరాధారణకు గురవుతున్నారని మండల మాలమహానాడు అధ్యక్షులు దేబార్కి కిరణ్ ఆవేదన వ్యక్తం చేసారు. చట్టరీత్యా దోషికి శిక్ష పడకున్నా పర్వాలేదు గాని నిర్దోషికి శిక్ష పడరాదన్న చందంగా ఆధార్ కార్డుల్లో తప్పుల తడకలకారణంగా అనర్హులు పథకాలు పొందుతుండగా అర్హులకు అన్యాయం జరుగుతోందన్నారు. కొంతమంది వైద్యులు నాయకులకు తొత్తులుగా మారి అనర్హులకు అర్హులుగా సదరం ధ్రువపత్రాలు కోకొల్లలుగా మంజూరు చేస్తున్న సంగతి పక్కన పెడితే మండలంలోని బానాది గ్రామంలో పింఛన్ పొందేందుకు తమ్ముడికి అర్హత ఉన్నపుడు అన్నకి ఎందుకు ఉండదో అధికారులు చెప్పాలన్నారు. ఆధార్ నమోదులో తప్పులు దొర్లినపుడు నిఖార్సయిన వైద్యుల సమక్షంలో వయసు నిర్ధారణ జరిపి వృద్ధాప్యంలో ఉన్న అర్హులకు పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియకు అధికారులు నడుం బిగించాలని కిరణ్ డిమాండ్ చేసారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తికీ వంద శాతం అంధుడుగా ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్న వైద్యులు అర్హుల వయసును నిజ నిర్ధారణ చేసే అవకాశం అవసరం లేదా అని మండల మాలమహానాడు అధ్యక్షులు దేబార్కి కిరణ్ ప్రశ్నించారు.స్థానిక ఎమ్మెల్యే,అధికారులు ఇప్పటికైనా జరిగిన పొరపాట్లను గుర్తించి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కిరణ్ కోరారు.

శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రుల సందర్భంగా 5వేల మందికి అన్నసమారాధన

విశాలాంధ్ర-చీపురుపల్లి: టౌన్ కస్పావీధిలో శ్రీ దుర్గాదేవి శరన్న వరాత్రులు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం 5వేల మందికి నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లిచీపురుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కిమిడి నాగార్జున విజయనగరం జిల్లా ఎంపీ సలీమణి బెల్లాన శ్రీదేవి ఈ కార్యక్రమాన్ని ఇంత అద్భుతంగా నిర్వహించినవారు లిశ్రీ దుర్గా మల్లేశ్వర సేవ ట్రస్ట్ చైర్మన్ చీపురుపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు ముల్లు రమణ గరివిడి మండలం కుమరాం గ్రామ తెలుగుదేశం పార్టీ సర్పంచ్ ముల్లు రమాదేవి ఈ కార్యక్రమంలో పైల బలరాం, సారే పాక సురేష్ బాబు, ప్రజలు, భక్తులు,మహిళలు, యువత, పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య రంగానికి పెద్దపీట

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వైద్య ఆరోగ్య రంగానికి వైసిపి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు పేర్కొన్నారు. నెల్లిమర్ల మండలం వల్లూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదవారికి గడప వద్దే వైద్యసేవలు అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారికి నిత్యం వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములు నాయుడు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపితోనే గ్రామాలలో మౌలిక వసతులు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : వైసిపితోనే గ్రామాలలో మౌలిక వసతుల కల్పన సాధ్యమని సర్పంచి పతివాడ అప్పన్న అన్నారు. నెల్లిమర్ల మండలం కొండగుంపాంలో రూ.8 లక్షలు నిధులతో నిర్మాణం చేపడుతున్న సీసీ రహదారి పనులను శుక్రవారం సర్పంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో కోటి రూపాయలతో సచివాలయం, వెల్నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రాలను నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అలాగే సీసీ డ్రెయినేజీలు రహదారులు నిర్మాణం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మొయిద రాంబాబు, పతివాడ రాజారావు ఎఇ అశోక్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుప్రజ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సందర్శించిన మున్సిపల్ చైర్మన్

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం చింతాడ వీధి 16,17 వార్డ్ ల్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సావు ప్రజలతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాల న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, 16వ వార్డ్ కౌన్సిలర్ సవలపురపు రామకృష్ణ (బాబు), సచివాలయం కన్వీనర్లు,వైద్య సిబ్బంది డాక్టర్ రెడ్డి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లెండిలో 'సిఎస్ఈఏఐ -2023' బ్రోచర్ విడుదల

విశాలాంధ్ర-డెంకాడ : లెండి లో కంప్యూటింగ్ ఫర్ సైన్స్, ఇంజినీరింగ్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై స్ప్రింగర్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ "(సి ఎస్ ఈ ఏ ఐ) 2023" బ్రోచర్ విడుదల లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ &టెక్నాలజీ, స్కోపస్ ఇండెక్స్ స్ప్రింగర్ స్టేట్ ప్రోమ్స్, అమెరికా కు చెందిన కేళిఫోర్నియా సహకారంతో కంప్యూటింగ్ కొరకు సైన్స్, ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ విధంగా ఉపయోగ పడతాయో అన్న అంశంపై జరుగుతున్న పరిశోధనలకై 2023 పేరిట అంతర్జాతీయ కాన్ఫరెన్స్ నిర్వహణకై నియమ నిబంధనల బ్రోచర్ను ప్రధాన హోస్ట్ ఐన సంస్థ కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ విభాగం కళాశాల సెమినార్ హాల్ లో ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ విడుదల చేసింది. ఈ కాన్ఫరెన్స్ 2023 నవంబర్ 24-25 తేదీలలో నిర్వహించబడుతోంది. ఈ కాన్ఫరెన్స్కు కన్వీనర్గా ఉన్న సి ఎస్ ఈ హెచ్ఓడి డాక్టర్ ఎ.రామారావు కాన్ఫరెన్స్ థీమ్ను ప్రకటిస్తూ కాఫెరెన్సు యొక్క ప్రొసీడింగ్స్ మరియు ముఖ్యాంశాలను ఉదహరిస్తూ బ్రోచర్ను విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 35 ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు మరియు %=ఙ% కేంద్రాలు ఈ సదస్సులో కమిటీలుగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. యొక్క ప్రధాన లక్ష్యం అకాడెమియా మరియు పరిశ్రమల నుండి పరిశోధకులకు వారి తాజా పరిశోధన, రచనలు, భవిష్యత్తు అంశాల పరిశోధన మరియు కంప్యూటర్ సైన్స్ మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశ్రమలలో సంభావ్య ప్రభావాన్ని పంచుకోవడానికి ఒక ఫోరమ్గా ఈ కాన్ఫరెన్స్ అందించబడుతుంది అని, కాన్ఫరెన్స్ సైన్స్, ఇంజనీరింగ్ మరియు %ూ×% లో కంప్యూటింగ్ కాన్సెప్ట్లు మరియు గణిత సాంకేతికతలపై దృష్టి పెడుతుందని, అవసరమైన గణిత ప్రకృతి దృశ్యాలు, లీనియర్ ఆల్జీబ్రాస్ ట్రాన్స్ఫార్మేటివ్ ఈక్వేషన్స్, కాలిక్యులస్ ఆప్టిమైజేషన్ సిమోసియమ్స్, ప్రాబబిలిటీస్, కృత్రిమ మేధస్సు యొక్క సారాంశాన్ని నిర్వచించే కంప్యూటింగ్ పద్ధతులు మరియు గణిత సమీకరణాల యొక్క టేప్స్ట్రీని ఒకచోట చేర్చి, డైనమిక్ రంగంలో నైపుణ్యానికి మార్గాన్ని ప్రకాశవంతం చేస్తుందని అన్నారు. .ఎస్.బోసుబాబు, అంతర్జాతీయ కార్యక్రమానికి ఆర్గనైనింగ్ చైర్గా మరియు ఎడిటర్గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. డాక్టర్ వివి రామారెడ్డి, ప్రిన్సిపాల్. కె.శివ రామ కృష్ణ, కరస్పాండెంట్ %ఙ% సెక్రటరీ. డాక్టర్ ఎ. రామారావు, హెచ్ఓడి, సిఎస్ఇ డీన్-ట్రైనింగ్ &ప్లేస్మెంట్స్ జి ప్రకాష్ బాబు %ఙ% శ్రీ పి.జె.వి.జి.ప్రకాశరావు, కాన్ఫరెన్స్ కో-కన్వీనర్లుగా కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ సెషన్లో పాల్గొనగా ఈ సెషన్లో వైస్ ప్రిన్సిపల్ అకడమిక్స్ %ఙ% అడ్మినిస్ట్రేషన్ డా.టి.హరిబాబు, డా.కె.నరసింహం మరియు ఇతర అన్ని విభాగాల అధిపతులు డాక్టర్ ఎం. రాజన్ బాబు, డాక్టర్ కె.సుబ్రహ్మణ్య, డాక్టర్ సతీష్ పూజారి, డాక్టర్ రాజేందర్, మిస్టర్ జి. సతీష్, డాక్టర్ పి దుర్గా శైలజ మరియు హోస్ట్ ఇన్స్టిట్యూట్లోని ఇతర సీనియర్ సిబ్బంది బ్రోచర్ విడుదల వేడుకకు హాజరయ్యారు.

జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో 'ఓపెన్ హౌస్'

విశాలాంధ్ర-పార్వతీపురం: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో బాగంగా పార్వతీపురం మన్యంజిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో "ఓపెన్ హౌస్" కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించుటకు స్కూల్స్/కళాశాలల విద్యార్థులు తరలిరాగా ఎస్పీతోపాటు ఇతర పోలీసు అధికారులు 'ఓపెన్ హౌస్' సందర్శించిన విద్యార్థులతో మమేకమై, అప్యాయంగా మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఆర్అధికారులు, సిబ్బంది పోలీసు శాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి,వారిలో స్ఫూర్తిను నింపారు. అధికారులు మాట్లాడుతూ-విధినిర్వహణలో తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల సంస్మరణార్ధం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా పోలీసుశాఖ ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్,వివిధ రకాల ఆయుధాలును విద్యార్థులకు చూపించి వాటిగురించి వివరించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుశాఖ వినియోగించే . 303 తుపాకీ, 7.62 ఎంఎం సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, పిస్టల్, కార్బైన్, ఎంపి 5కె సబ్ మెషిన్ గన్, 22 రైఫిల్, మోర్టార్, 5.56 ఎంఎం ఇన్సాస్, 7.62 ఎంఎం ఎకే 47, , టియర్ గ్యాస్ గన్, మల్టీషెల్ లాంచర్ ఆయుధాల పని తీరును విద్యార్థులకు ఆర్మ్ రిజర్వు సిబ్బంది వివరించారు. జిల్లా పోలీసు శాఖలో కమ్యునికేషన్ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుందని, ఏదైనా విషయాన్ని ఒకరి నుండి వేరొకరికి చేర వేయడానికి విహెచ్ఎఫ్ సెట్ ద్వారా సమా చారాన్ని తెలుపుతా రన్నారు. బందోబస్తు విధుల్లో ఏదైనా సమాచారాన్ని, ఆదేశాలను పోలీసు అధికారుల మరియు సిబ్బందికి అందరికి ఒక్కసారే తెలిపేందుకు, తెలసుకొనేందుకు కమ్యూనికేషన్ వ్యవస్థ కీలకంగా పనిచేస్తుందని కమ్యూనికేషన్ అధికారులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం లోఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీ జి. మురళీధర్,ఎస్బి సిఐ సిఎచ్.లక్ష్మణరావు, ఏఆర్ఆర్ఐ కుమార్, శ్రీరాములు, శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, పాఠశాల/కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామీ...ఏమిటిది ?

జనసేన నాయకుడు గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి, వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు తప్పుడు సంకేతాలిస్తున్నారని విజయనగరం జనసేన నాయకుడు గురాన అయ్యలు దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల నుంచి సంప్రదాయబద్ధంగా జరుగుతున్న విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాలను కూడా కోలగట్ల, ఆయన అనుయాయులు తమ కబంధ హస్తాల్లో బంధించి జరిపిస్తున్నారని విమర్శించారు. నిన్నగాక మొన్న సిరిమాను చెట్టును తరలించడంలో నానా రాద్ధాంతం జరిగిన విషయాన్ని ఈ సందర్భంగా ఉదహరించారు. ఇలాంటి చర్యలతో స్వామి, ఆయన అనుచరులు అమ్మవారి భక్తులకు ఎలాంటి సంకేతాలిస్తున్నారో అర్ధం కావడం లేదని వ్యాఖ్యానించారు. భక్తులు, ప్రజల మనోభావాలతో సంబంధం లేకుండా తమకి నచ్చిన విధంగా తాము చేసుకుపోతామనే ధోరణిలో వైసీపీ నాయకులు వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అసలు పూసపాటి వంశీయుల ఆధ్వర్యంలో, వారి నేతృత్వంలో జరగాల్సిన సిరిమాను సంబరాలపై కోలగట్ల వీరభద్రస్వామి, ఆయన మనుషుల పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఆఖరుకి సిరిమాను సంబరం రోజున యువకులు వేసుకునే టీ షర్టుల పంపిణీ కూడా వైసీపీ నాయకుల కనుసన్నల్లో జరగాలనడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం అనేది దేవుడికి సంబంధించిన అంశం కాబట్టి దీనిలో రాజకీయ పార్టీల ప్రమేయం ఉండకూడదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎంత వరకూ ఉండాలో అంత వరకే ఉండాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు. వీఐపీలు వెళ్ళే దారికి సంబంధించిన తాళాలు కూడా కోలగట్ల గుప్పెట్లో ఉంచుకుంటున్నారని, గత ఏడాది సాక్షాత్తూ మంత్రి బొత్సకే దిక్కు లేక రోడ్డు మీద నిలబడాల్సి వచ్చిందని అయ్యలు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

మీకో రూలూ...మాకో రూలా?

అమ్మవారి పండుగ నేపథ్యంలో ఫ్లెక్సీలు వెయ్యాలని ఔత్సాహికులు అనుకున్నా.. వద్దంటున్నారని, మరి ఎమ్మెల్యే కోలగట్ల తన మనుమరాలు పుట్టిన రోజున ఊరంతా ఫ్లెక్సీలు ఎలా కట్టారని, అధికారులు ఎలా కట్టనిచ్చారని అయ్యలు ప్రశ్నించారు.సెక్షన్-30 అమల్లో ఉందంటూ టీడీపీ, జనసేన నాయకుల కార్యక్రమాలను అడ్డుకుంటున్న వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు ఇవేళ సాధికారత పేరిట బైక్ ర్యాలీ ఎలా చేశారని, ఎలా అనుమతిచ్చారని, మీకైతే ఓ రూలూ... మాకైతే మరో రూలా అంటూ ధ్వజమెత్తారు. వైసీపీ నాయకులకు అసలు సాధికార యాత్ర చేసే అర్హతే లేదని దుయ్యబట్టారు. సామాజిక న్యాయం, సాధికారత అంటూ పెద్ద పెద్ద మాటలు చెబుతున్న వైసీపీ నాయకులు మేయర్ విజయలక్ష్మికి ఏం విలువ ఇచ్చారని ప్రశ్నించారు. డిప్యూటీ మేయర్ పదవుల్లో ఒక్కటి కూడా ఎస్టీలకో, ఎస్సీలకో ఎందుకివ్వలేదని నిలదీశారు. స్వంత మనుషుల్ని అందలమెక్కించడాన్నే సాధికారత, సామాజిక న్యాయం అంటారా అని ప్రశ్నించారు.

ఈక్రాఫ్ నమోదుకు రైతులకు మరో అవకాశం



విశాలాంధ్ర-జామి: జిల్లాలో ఈక్రాఫ్ పంట నమోదు చేసిన రైతుల జాబితాలను గ్రామసభలలో తెలియజేయడం జరుగు తుందని, ఇంకా మిగిలి పోయిన రైతులకు ఈనెల 28 సాయంత్రం వరకు అవకాశం ఉందని జిల్లా వ్యవసాయాధికారి వి.టి. రామారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని భీమసింగి గ్రామంలో రైతు గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈక్రాఫ్ నమోదు వలన రైతులకు కలిగే లాభాలను వివరించారు. ఈకార్యక్రమంలో కొత్తవలస ఎడిఎ విజయ, జామి వ్యవసాయాధికారి పి. కిరణ్కుమార్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల రమణబాబు, సచివాలయ కన్వీనర్ మజ్జి హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం : బడ్డుకొండ



విశాలాంధ్ర-భోగాపురం: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష పథకం పేదలకు ఒక గొప్ప వరమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలో గూడెపువలస గ్రామంలో జగన్నన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర వచ్చిన తరువాత భారతదేశం మొత్తం మీద జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమం ఎవరు నిర్వహించలేదన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష తో పేదల ఆరోగ్యానికి వైసీపీ ప్రభుత్వం అత్యంత రక్షణ కల్పిస్తోందన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఆలోచనా విధానం నుంచి పుట్టిన అద్భుత పథకమని తెలిపారు. ఇప్పటికే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పేదలకు కార్పొరేట్ హస్పెటల్స్ లో ఉచితంగా మెరుగైన వైద్యం అందుతోందని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఆరోగ్య రంగం కుదేలైందని అయన విమర్శించారు. రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా వుండా లన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిభిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపిడిఓ అప్పలనాయుడు, తహసీల్దార్ బంగార్రాజు, ఎంఈఓ రమణమూర్తి, వైసిపి నాయకులు కొల్లి రామ్మూర్తి, దల్లి శ్రీనివాసరావు సర్పంచులు, ఎం పి టి సి లు నాయకులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వ్యక్తి గురువారం రాత్రి పురుగుల మందు తాగగా విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఎస్సై కోనేటి రాజేష్, స్థానికుల వివరాల మేరకు బొద్దాం గ్రామానికి చెందిన పిల్లా ఈశ్వరరావు (35) మద్యానికి బానిస కాగా గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్య బాధలు భరించలేక గురువారం రాత్రి పురుగుల మందు సేవించగా కుటుంబసభ్యులు వెంటనే విశాఖ కేజీహెచ్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం ఈశ్వరరావు మృతి చెందాడు.మృతుడి భార్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంపపంచనామా జరిపి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర-బెలగాం: ఊకలోడుతో వెళుతున్న ట్రాక్టర్ ను ఆర్టీసీ బస్సు ఓవర్టేక్ చేసే క్రమంలో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాడంగి మండలం డొంకినవలస గ్రామానికి చెందిన ఓబురెడ్డి లోకేశ్వరరావు బొబ్బిలి గ్రోత్ సెంటర్ లో ఇంటెక్స్ ఫెరోవైన్ కంపెనీలో అసిస్టెంట్ హెచ్ఆర్ గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పాలకొండ నుండి బొబ్బిలి వెళ్లడానికి పార్వతీపురం వరకు ఆర్టీసీ బస్సులో వచ్చి అక్కడ నుండి మరల బొబ్బిలి వెళ్లడానికి మరొక ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా బస్సుకు ఎడమ వైపు వరుస సీటులో కిటికీ ప్రక్కన కూర్చుని కిటికీ బయట ఉన్న స్టీల్ రాడ్ పై తన ఎడమ చేయిని వేసుకొని కూర్చుని ఉండగా నర్సిపురం గ్రామం దాటిన తర్వాత గురురాజు కోళ్ళ ఫారం ఎదురుగా వచ్చేసరికి మెయిన్ రోడ్డుపై ఊక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ఊకలోడు బలంగా రాసుకొని వెళ్లడంతో అతని ఎడమ మోచేయి బస్సుకి ఊకలోడికి మధ్య నలిగింది. ఈసంఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆర్టీసీ బస్ కండక్టర్ గమనించి 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఐటిఐ లో 28న మినీ జాబ్ మేళా

విశాలాంధ్ర-బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఈనెల 28న శనివారం ఉదయం 9 గంటల నుంచి మినీ జాబ్ మేళా నిర్వహించ నున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నీలం గోవిందరావు విలేకరుల కు తెలిపారు. నిరుద్యోగ యువత యువకులకు 18 నుంచి 24 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన ఐటిఐ లేదా డిప్లొమా డిగ్రీ ఉత్తీర్ణులైన యువతలో (ఫేమేల్) జాబ్ మేళాకు హాజరు కావచ్చు అని ఆయన తెలిపారు ఆసక్తి కలిగిన అభ్యర్థులు స్కిల్ యూనివర్సిటీ ఏపీఎస్ఆర్టీసీ డాట్ ఇన్ వెబ్సైట్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ జిరాక్స్ సర్టిఫికెట్లు ఫోటోలతో శనివారం ఐటిఐ లో హాజరు కావాలన్నారు. వివరాలకు ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రమణ రావు 7989836954 , 9000102013, టోల్ ఫ్రీ నెంబరు 9988853335లకు సంప్రదించాలన్నారు.

మున్సిపల్ మరుగుదొడ్లు స్థల పై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

మల్లంపేట కౌన్సిలర్, ప్రజలు డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: మున్సిపాలిటీ మల్లంపేటలో నిర్మించిన కమ్యూనిటీ మరుగుదొడ్లు, మంచినీటి కుళాయి లను తొలగించిఆ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని, ఆ స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకొని తిరిగి ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించాలని ఆ వార్డు కౌన్సిలర్ కొర్లపు రామారావు, గ్రామ ప్రజలు డిమాండ్ చేసారు.ఈ సమస్య పరిష్కారంకోసం మున్సిపల్ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టరు లకు కూడా ఫిర్యాదులు అందజేశారు. ఆ గ్రామంలోని సర్వే నెంబర్ :155/12 లో ఏడు సెంట్లు,155/14 లో ఐదు సెంట్లు మున్సిపల్ స్థలంలో బొబ్బిలి మున్సిపాలిటీ తమ గ్రామ ప్రజల అవసరం నిమిత్తం గతంలో కమ్యూనిటీ మరుగుదొడ్లు గదులు, బోరుబావి నిర్మాణం చేపట్టారు. వాటిని ప్రజలు సరిగా వినియోగించనందున అవి చిదిలమయ్యాయి. వాటిని ప్రక్కనే వున్న, మా గ్రామానికి చెందిన తెంటు రామకృష్ణ, తెంటు సత్యనారాయణ లు తొలగించి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నారు.అక్రమంగా భవనాలు కూడా నిర్మించుకున్నారు అని తెలిపారు. మున్సిపల్ మరుగుదొడ్లు స్థలాన్ని ఆక్రమించి, ఆ స్థలంలో అక్రమంగా భవనాలు నిర్మించారు...అక్కడ ఆక్రమణ దారులు అక్రమంగా నిర్మించిన భవనాలను తొలగించి, మున్సిపల్ కమ్యూనిటీ మరుగు దొడ్లు తొలగించి, ఆక్రమించిన ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి... మరియు ఆ స్థలాన్ని గ్రామ ప్రజల కమ్యూనిటీ అవసరాలకు వినియోగించాలని విన్నవించారు . దీనిపై రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఆస్థలం గ్రామకంఠం దే నిర్ధారించారాని విలేకరుల కు తెలిపారు. రెవెన్యూ అధికారులు ,మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు .

దళితులకు అన్యాయం చేసిన వైసీపీ

ఏం సాధించారని సామాజిక బస్సు యాత్ర?

టీడీపీ జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున సూటి ప్రశ్న

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : వైకాపా సామాజిక బస్సు యాత్ర ఘోరంగా విఫలమైందని.. తుస్సు యాత్రగా మారిందని జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. అసలు ఈ బస్సు యాత్రను ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వానికి కేవలం డీజిల్, పెట్రోల్ నష్టం తప్ప.. దీని వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని ఎద్దేవా చేశారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడారు. ఈ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలూ నష్టపోయారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేదన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 20 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయామన్నారు. "ఏం సాధించారని బస్సు యాత్ర.. బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించినందుకా? బీసీ సోదరులకు ఉన్న 29 పథకాలను, ఎస్సీలకు ఉన్న 27 పథకాలను రద్దు చేసినందుకా? విదేశీ విద్య పథకం, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఈ రోజు ఎందుకు లేవన్నారు. గత తెదేపా హయాంలో ఆదరణ పథకం ద్వారా వెనుకబడిన వర్గాలకు పనిముట్లు ఇచ్చి, వృత్తికి ఆదరణ కల్పించామన్నారు. ఈ రోజు ఆ పథకాలు ఏమ య్యాయన్నారు. మంత్రి బొత్సకు ఇవే నా సూటి ప్రశ్నలని, బస్సు యాత్రలో ముందు సీట్లో కూర్చొంటున్న మంత్రి బొత్స కు తాను ఒకటే సూటి ప్రశ్న వేస్తానన్నారు. జిల్లా పరిషత్తు చైర్మన్ రిజర్వేషన్ను ఎందుకు మార్చారని ప్రశ్నించారు. రాజ్యాంగం ప్రకారం ఎస్సీ మహిళ కోసం ఇచ్చిన రిజర్వే షన్ను మేనల్లుడికి పట్టం కట్టేందుకు ఎందుకు మార్చారో చెప్పగలరా? అని నిలదీశారు. కనీసం బొత్స ప్రాతినిధ్యం వహిస్తున్న చీపు రుపల్లి నియోజక వర్గానికి కొత్తగా ఒక విద్యాసంస్థ అయినా తీసుకొచ్చారా? ప్రజల వ్యతిరేకతను నేరుగా ఎదుర్కొనలేక బస్సు యాత్ర చేస్తున్నారన్నారు. ఇటువంటి యాత్రలు ఎన్ని చేసినా వైకాపాకు వచ్చిన లాభం, తెదేపాకు వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు.